సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా
రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్లు సత్తా చాటాయి. బాలికల జట్టు గెలుపొందగా, బాలుర జట్టు రన్నరప్‌గా నిలిచింది.
- 8లో ▸



ప్రాధాన్యత ఇవ్వండి
ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.0 /22.9

వాతావరణం
ఉదయం చల్లనిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

సీనియర్ల గుర్రు


గడుగు గంగాధర్


బాడ్సి శేఖర్‌గౌడ్



నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూడాల్సి రావడంపై జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క బాల్కొండ నియోజకవర్గం నుంచి ముగ్గురికి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవులను కేటాయించి, వారికంటే సీనియర్లమైన తమను పట్టించుకోవడం లేదని ఆగ్రహంగా ఉన్నారు. ప్రస్తుత పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి రేసులో ఉన్నారు.

- నామినేటెడ్ పదవుల కోసం కాంగ్రెస్ నేతల ఎదురు చూపులు
- జూనియర్లకు పదవులు ఇచ్చి తమకు ఇవ్వకపోవడంపై మనస్తాపం
- ఆది నుంచి పార్టీకి సేవలందిస్తున్నప్పటికీ వేచిచూడాల్సి రావడంపై అసహనం
- రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవుల రేసులో బాడ్సి శేఖర్‌గౌడ్, గడుగు గంగాధర్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచింది. ఇప్పటికీ పలువురు సీనియర్ నాయకులు నామినేటెడ్ పదవుల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. పైగా తమకంటే జూనియర్లకు కీలకమైన పదవులు కేటాయించడం పట్ల గుర్రుగా ఉన్నారు. ఆది నుంచి పార్టీకి సేవలందిస్తున్నప్పటికీ తమను వెనక్కు నెట్టేయడంపై ఆవేదన చెందుతున్నారు. 40 ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తున్నా నాయకత్వం గుర్తించకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు.

■ బాల్కొండ నియోజకవర్గం నుంచి ఏకంగా ముగ్గురికి రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ పదవులను కేటాయించారు. వారికంటే సీనియర్లమైన తమకు మాత్రం పదవులు ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తుండడంపై కాంగ్రెస్ నేతలు ఆగ్రహంగా ఉన్నారు. కొందరికి మాత్రం జిల్లా ప్రజాపరిషత్, మేయర్, మున్సిపల్ చైర్మన్ల పదవులు కేటాయించేందుకు నిర్ణయించారు. అయినప్పటికీ తమకు మాత్రం నామినేటెడ్ పదవులు కేటాయించడం లేదని గుర్రుగా ఉన్నారు.

■ జుక్కల్ ఎమ్మెల్యే టికెట్టు ఆశించి భంగపడిన గడుగు గంగాధర్ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి కోసం ఎదురు చూస్తున్నారు. 1983 నుంచి పార్టీకి సేవలందిస్తున్న గడుగు గంగాధర్ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా, మున్సిపల్ కౌన్సిలర్‌గా, ఫ్లోర్ లీడర్‌గా, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. గతంలో దివంగత వైఎస్ఆర్ అనుచరుడిగా ఉన్న గడుగు ప్రస్తుతం మాజీ మంత్రి, బోధన్ సీనియర్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అనుచరుడిగా ఉన్నారు.

■ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి టికెట్టు సాధించే విషయంలో, ఆయన గెలుపు విషయంలో తీవ్రంగా కృషి చేసిన బాడ్సి శేఖర్‌గౌడ్ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి రేసులో ఉన్నారు. 1983 నుంచి శేఖర్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ వస్తున్నారు. ఆయన తండ్రి మారుతిగౌడ్ సైతం కాంగ్రెస్ నాయకుడిగా సేవలందించారు. మారుతిగౌడ్ సొసైటీ చైర్మన్‌గానూ పనిచేశారు. శేఖర్‌గౌడ్ అదేబాటలో విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్‌కు సేవలందిస్తున్నారు. బాడ్సి సర్పంచ్‌గా పదేళ్లపాటు వ్యవహరించారు. ఆ సమయంలో ఉమ్మడి నిజామాబాద్ సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా, సర్పంచ్‌ల సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కొనసాగారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికి సన్నిహితుడిగా ఉన్నారు. తరువాత జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడిగా సేవలందించారు. ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్నారు. ఆది నుంచి పార్టీ మారకుండా నాలుగు దశాబ్దాల పాటు సేవలందించిన శేఖర్‌గౌడ్‌కు రాష్ట్ర కార్పొరేషన్ పదవి కేటాయించాలని అనుచరుల నుంచి డిమాండ్లు వస్తున్నాయి.

హోరాహోరీగా యూత్ కాంగ్రెస్ ఎన్నికలు

- ఫలితాలకు నెల రోజులు పట్టే అవకాశం
- జిల్లాలో 45 వేలకు పైగా పోలైన ఓట్లు
- విపుల్‌గౌడ్, నాగేంద్ర మధ్య ప్రధాన పోటీ



ఖలీల్‌వాడి: యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి కోసం ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 14 వరకు ఆన్‌లైన్‌లో ఓటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికలకు ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల తరహాలో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, వివిధ స్థాయిలో ఉన్న కాంగ్రెస్ లీడర్లు తమకు అనుకూలంగా ఉన్న యువజన కాంగ్రెస్ నేతలను గెలిపించడానికి శతవిధాలుగా ప్రయత్నాలు చేశారు. ఆన్‌లైన్‌లో జరిగిన ఎన్నికల్లో జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతోపాటు 18 ఏళ్లు నిండిన యువతీయువకులకు పార్టీలతో సంబంధం లేకుండా ఓటు వేసే అవకాశం కల్పించారు. గ్రామ, మండల, పట్టణంలోని వార్డులలో ఇన్‌చార్జీలను ఏర్పాటు చేసి ఆన్‌లైన్ ఓటింగ్‌లో పాల్గొనేలా చూశారు. ఆన్‌లైన్‌లో ఓటు వేసే వారు తమ ఆధార్ కార్డు వివరాలను నమోదు చేసి రూ.50 చెల్లించి ఓటు వేశారు.

ఫలితాలు ఆలస్యం

యువజన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల ఫలితాలు తేలడానికి నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి మార్పుతో రాష్ట్రంలో ఫలితాలు ఆలస్యంగా వెలువడే అవకాశాలు ఉన్నాయి. దీంతోపాటు ఆన్‌లైన్ ఓటింగ్‌లో పాల్గొన్న వారిలో వయసు ఎక్కువ ఉన్నవారి వివరాలను తీస్తున్నట్లు తెలిసింది. వయసు ఎక్కువ ఉన్న వారి ఓట్ల గురించి కొందరు యువజన నాయకులు ఫిర్యాదు చేయడంతో వాటిని వడపోస్తున్నట్లు తెలిసింది. దీంతో ఎన్నికల ఫలితాలు ఆలస్యం అవుతాయని యూత్ కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలిసింది.

బరిలో ఐదుగురు అభ్యర్థులు

జిల్లాలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి కోసం ఆరుగురు అభ్యర్థులు పోటీ పడ్డారు. అందులో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి విపుల్ గౌడ్, బాల్కొండ యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి నాగేంద్ర, నిజామాబాద్ రూరల్ యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉమ్మాజీ నరేష్, జిల్లా యువజన నేత అద్నాన్, నందిపేట్ మండలం డీకంపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్, బాల్కొండకు చెందిన అనుపల్ల సాయికిరణ్ పోటీలో నిలబడ్డారు. ఇందులో ఉమ్మాజీ నరేష్ పోటీకి అనర్హుడు కావడంతో మధ్యలో నుంచి నిష్క్రమించారు. మిగతా ఐదుగురు జిల్లాలోని యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, ఇతర యువత ఆన్‌లైన్ ఓటింగ్‌లో పాల్గొనే విధంగా చూశారు. దీంతో జిల్లాలో 45 వేల పైగా ఓట్లు పడ్డాయి. ఇందులో ప్రధానంగా విపుల్‌గౌడ్, నాగేంద్ర తమకు ఓటు వేయించాలని ఎమ్మెల్యేలు, రాష్ట్ర, జిల్లా, ప్రజాప్రతినిధులను కలిసి అభ్యర్థించారు. దీంతో వీరి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఎవరు గెలిచిన తక్కువ ఓట్లతోనే గెలుపొందుతారనే ప్రచారం ఉంది. అయితే జిల్లా నుంచి అధ్యక్ష పదవి పోటీ పడిన వారందరూ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలలో జక్కిడి శివచరణ్‌రెడ్డికి సపోర్ట్ చేయడం గమనార్హం.

న్యూస్‌రీల్

ఉప రాష్ట్రపతిని కలిసిన ఎంపీ అర్వింద్



సుభాష్‌నగర్: ఎంపీ ధర్మపురి అర్వింద్ సోమవారం ఢిల్లీలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

27న జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు

నిజామాబాద్ నాగారం: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27న జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో ముత్తెన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. నగరంలోని న్యూ అంబేడ్కర్ భవనంలో 27న ఉదయం 10గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. ఇందులో జానపద నృత్యం(బృందం, వ్యక్తిగతం), జానపద పాటలు(బృందం, వ్యక్తిగతం), కథ, రచన, పోస్టర్ మేకింగ్, పెయింటింగ్, హస్తకళలు, టెక్స్‌టైల్స్, వ్యవసాయ ఉత్పత్తులు తదితర అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9701177144 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ సంస్థలో ఉత్తమ అధికారుల ఎంపిక

సుభాష్‌నగర్: విద్యుత్ సంస్థల్లో మార్కుల ఆధారంగా ఆగస్టు నెలకు సంబంధించి ఉత్తమ అధికారులను ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సోమవారం సాయంత్రం ప్రకటించారు. గ్రామీణ ప్రాంతంలో ఉత్తమ ఏఈలుగా సత్యప్రసాద్, పి శ్రీనివాస్, గయ్యాస్ అహ్మద్, నాయిని కృష్ణ, ఉత్తమ ఏడీఈగా శ్రీధర్, ఉత్తమ డీఈగా ఎం శ్రీనివాస్, ఎస్ఈగా ఆర్ రవీందర్‌లను ఎంపికచేశారు. పట్టణప్రాంతంలో ఉత్తమ ఏఈగా గంగాశేఖర్, ఏడీఈలుగా తోట రాజశేఖర్, ఎం అశోక్, డీఈగా హరిచంద్రనాయక్ ఎంపికయ్యారు.

విత్తనోత్పత్తితో రైతులకు లాభాలు



డొంకేశ్వర్(ఆర్మూర్): విత్తనోత్పత్తి చేయడంతో రైతులకు లాభాలున్నాయని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పీడీ ప్రవీణ్ అన్నారు. సోమవారం మార్కెట్ యార్డులోని జీవ నియంత్రణ ప్రయోగశాలలో వరి విత్తనోత్పత్తిపై గ్రామీణ యువ రైతులకు నైపుణ్య శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. రైతులు విత్తనాలను కొనడం కన్నా నిల్వ ఉంచుకుని మరుసటి పంటకు ఉపయోగించుకోవడంతో సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. ఇతర రైతులకు విక్రయించడంతో ఆదాయం కూడా అర్జించవచ్చన్నారు. డీపీడీ దైవగ్లోరి, ఏడీఏ కోటేశ్వర్‌రావు, భరత్‌కుమార్ తదితరులున్నారు.

ఇన్‌చార్జి డీపీవోగా శ్రీనివాస్

సుభాష్‌నగర్: జిల్లా పంచాయతీ అధికారిగా నిజామాబాద్ డీఎల్‌పీవో శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాలు జారీ చేశారు. డీపీవో తరుణ్‌కుమార్‌ను రెండ్రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వ సర్వీసులకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చిన విషయం తెలిసిందే. సోమవారం తరుణ్‌కుమార్ రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించారు.

ఉత్తర్వులను సవరించాలి

నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి ఇటీవల రాష్ట్ర ఉన్నతాధికారులు విడుదల చేసిన ఉత్తర్వులను సవరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిబంధనలు సక్రమంగా లేవని, దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి జీవో నెంబర్ 25లో అంశాలను వెంటనే మార్చాలని ధర్మ టీచర్స్ యూనియన్ నాయకులు సోమవారం కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రశాంత్, జిల్లా విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం సమర్పించారు.

జీజీహెచ్‌లో అక్రమాలపై నిగ్గు తేల్చాలి


'సాక్షి' కథనాల క్లిప్పింగ్‌లతో ప్రజాపంథా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నిజామాబాద్ నాగారం : నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిధుల దుర్వినియోగం, అక్రమాలపై నిగ్గు తేల్చాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. జీజీహెచ్‌లో జరిగిన అక్రమాలపై 'సాక్షి'లో ప్రచురితమైన క్లిప్పింగ్‌లు పట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నగర కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ కొన్ని నెలలుగా జీజీహెచ్‌లో నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. ముఖ్యంగా ఆరోగ్య శ్రీ విభాగంలో రూ.10కోట్ల నష్టం జరిగిందన్నారు. అయినా ఆరోగ్య శ్రీ విభాగంలోని సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ఆస్పత్రిలో బయోమెట్రిక్ మాల్ ప్రాక్టీసు చేస్తున్నారని ఆరోపించారు. జీజీహెచ్‌కు చికిత్స కోసం వచ్చే రోగులను కమీషన్ల కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫరల్ చేస్తున్నారన్నా రు. మందులు కొంటున్నట్లు లెక్కలు చూపి నిధులు స్వాహా చేస్తున్నారన్నారు. రోగులకు, అటెండెంట్లకు నాసిరకం భోజనం పెడుతున్నారని పేర్కొన్నారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె గణేష్, మురళి, విఠల్, సాయిబాబా, అమూల్య, లలిత, మహిపాల్, నసీర్, మణెమ్మ, రాజయ్య పాల్గొన్నారు.

తగ్గనున్న మొరం ధరలు

- వరద కాలువ నుంచి ఉచితంగా తరలింపునకు అనుమతి
- అవసరం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచన


బస్సాపూర్ శివారులో వరద కాలువ నుంచి మొరం తరలిస్తున్న టిప్పర్

బాల్కొండ: వరద కాలువ నుంచి ఉచితంగా మొరం తరలింపునకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో ధరలు తగ్గనున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి మిగులు జలాలను సద్వినియోగం చేసుకోవడానికి వరద కాలువ నిర్మించారు. ఈ కాలువ తవ్వకంలో మొరం కుప్పలుగా పేరుకుపోయింది. ఇన్నాళ్లు ప్రభుత్వానికి సీనరేజ్ చెల్లించి వరద కాలువ మొరం తరలించేవారు. ప్రస్తుతం సీనరేజ్ చెల్లించకుండా రైతులు, కొత్తగా ఇల్లు కట్టుకునే వారు ఉచితంగా మొరం తీసుకెళ్ల వచ్చని ప్రకటించారు. దీంతో మొరం ధరలు తగ్గుతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంత వరకు మొరం టిప్పర్‌కు రూ.1200 చొప్పున ప్రభుత్వానికి చెల్లించేవారు.

నిబంధనల ప్రకారం

నిబంధనల మేరకే ఉచితంగా మొరం తరలించుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. రైతులు పంట భూములకు తరలించుకోవాలంటే అందుకు సంబంధించి పట్టా పాస్ బుక్ పుస్తకం జిరాక్స్‌ను జత పరుస్తూ తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలి. అక్కడ అనుమతి పొందిన తర్వాత మళ్లీ జిరాక్స్‌తో మరో దరఖాస్తును ప్రాజెక్ట్ ఈఈకి పెట్టుకోవాలి. అప్పుడు ఎన్ని క్యూబిక్ మీటర్ల మొరం అవసరం ఉంటుందో లెక్కించి అధికారులు అనుమతిస్తారు. కొత్తగా ఇల్లు కట్టుకునే వారు ఇంటి పర్మిషన్ కాపీ జత చేస్తు నేరుగా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఈఈకి దరఖాస్తు చేసుకోవాలి. అప్పుడే మొరం ఉచితంగా తరలించుకోవడానికి అధికారులు అనుమతి ఇస్తారు. ఇది వరకు మొరం వ్యాపారులు టిప్పరుకు రూ.మూడు వేలు, ట్రాక్టర్‌కు రూ.1500 చొప్పున తీసుకునే వారు. ప్రస్తుతం కనీసం టిప్పర్‌కు రూ.1000, ట్రాక్టర్ రూ.500 వరకు ధర తగ్గే అవకాశం ఉంది.

వీడీసీల మాట ఏమిటి

మొరం తరలింపునకు ప్రభుత్వం ఉచితంగా అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించింది. కానీ వీడీసీల మాట ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు వరద కాలువ ప్రవహిస్తున్న ఏ గ్రామం నుంచి మొరం తరలించినా సంబంధిత వీడీసీ సభ్యులకు కొంత డబ్బు చెల్లించాల్సి ఉండేది. గ్రామానికి ఒక విధంగా డబ్బు తీసుకున్నారు. ప్రస్తుతం వీడీసీలకు చెల్లించే అవసరం ఉందా లేదా అనేది తేల్చాల్సిన అవసరం ఉంది. ఆయా గ్రామాల మీదుగా మొరం వాహనాలు వెళ్లడంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని వాటి మరమ్మతుల కోసమంటూ డబ్బు వసూలు చేసేవారు. ప్రస్తుతం ఉచితంగా ప్రభుత్వం సరఫరా చేసినప్పుడు కూడా వీడీసీలకు చెల్లించాలా వద్దా అనేది తేలిస్తే ప్రజలకు మరింత చౌకగా మొరం దక్కే అవకాశం ఉంటుంది.

మౌఖికంగా ఆదేశాలిచ్చారు

వరద కాలువ నుంచి ఉచితంగా మొరం తరలించుకునేలా చర్యలు తీసుకోవాలని మౌఖికంగా ఆదేశాలిచ్చారు. దాని ప్రకారమే నడుచుకుంటాం. మైనింగ్ శాఖకు మొరం తరలింపు బాధ్యతలు అప్పగించాలనే అభిప్రాయం కూడా వచ్చింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

పచ్చిధాన్యానికి డిమాండ్


ధాన్యం తరలిస్తున్న హమాలీలు

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వరికోతలు ప్రారంభమయ్యాయి. వ్యాపారులు పంటచేన్ల వద్దకే వచ్చి పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలుకు రూ.2,250 చెల్లించి తీసుకెళ్తున్నారు. దీంతో రైతులు పచ్చిదానం విక్రయానికి మొగ్గు చూపుతున్నారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించినప్పటికీ రైతులు దళారులకు విక్రయిస్తున్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన డీఎస్ స్మారక టోర్నీ


మాట్లాడుతున్న ధర్మపురి సురేందర్


వాలీబాల్ ఆడుతున్న బాలికలు

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్ మైదానంలో ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) స్మారక పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా సొసైటీ ప్రతినిధి ధర్మపురి సురేందర్ హాజరై క్రీడా పతకాన్ని ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డీఎస్ జయంతిని పురస్కరించుకొని క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయడానికే టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 150 పాఠశాలలు, జూనియర్ కళాశాల నుంచి క్రీడాకారులు పెద్ద ఎత్తున వచ్చారన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటి ప్రతినిధులు డి సాయిలు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి, సీనియర్ పీడీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు పంటకు తెగుళ్ల బెడద


పసుపు పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారిణి సంధ్య

ఆర్మూర్: ముసురు వానలతో వ్యవసాయ క్షేత్రాలు నీటితో నిండిపోవడంతో పసుపు పంట తెగుళ్ల బారిన పడే ప్రమాదం ఉందని ఉద్యానవన శాఖ అధికారి సంధ్య పేర్కొన్నారు. ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాల్లో తెగుళ్ల బారిన పడ్డ పసుపు పంటను సోమవారం ఆమె పరిశీలించారు. అనంతరం తెగుళ్ల నివారణకు రైతులకు పలు సూచనలిచ్చారు. ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలో సుమారు 6,130 ఎకరాల్లో పసుపు పంట సాగవుతోందన్నారు. పెద్ద మొత్తంలో పంటలకు తాటాకు మచ్చ తెగులు, లద్దె పురుగు (ఆకుపచ్చ పురుగు) తెగులు, దుంపకుళ్లు, దుంప ఈగ, ఆకు మాడు తెగులు సోకాయన్నారు. దీంతో పంటల దిగుబడి గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు తమ పంటను కాపాడుకోవడానికి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. తెగుళ్ల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. పంటకు తెగుళ్లు సోకితే నివారణ చర్యల కోసం 8977713980 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

క్లుప్తంగా

వరద కాలువ ద్వారా నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్‌ అధికారులు సోమవారం ప్రారంభించారు. ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ ఫ్లో పెరగడంతో ప్రాజెక్ట్‌ నిండుకుండలా మారింది. ఎగువ నుంచి 11వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. కాకతీయ కాలువ ద్వారా 6,800 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 50, వరద కాలువ ద్వారా 3వేల క్యూసెక్కులు,అలీసాగర్‌ లిఫ్ట్‌ ద్వారా 180 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరుపోతోంది. మిషన్‌ భగీరథకు 231 క్యూక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్‌ నిండుకుండలా ఉంది.

దరఖాస్తుల ఆహ్వానం

బాల్కొండ: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌ పాఠశాల బాలిక హాస్టల్‌లో కేర్‌ టేకర్‌ ఉద్యోగం కోసం ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి భవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి 29 సాయంత్రం వరకు మోడల్‌ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిగ్రీతోపాటు బీఈడీ పూర్తి చేసిన 35 ఏళ్ల వయస్సు వారై కంప్యూటర్‌ పరిజ్ఞానం ఉన్న మహిళలు అర్హులని పేర్కొన్నారు. బాల్కొండ మండలానికి చెందిన వారై ఉండాలన్నారు. ఇతర వివరాలకు 77319 13778 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు క్విజ్‌ పోటీలు



నిజామాబాద్‌నాగారం: 'యూత్‌ ఫెస్ట్‌'లో భాగంగా జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలోని జిల్లా ఎయిడ్స్‌ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్‌ పోటీలను నగరంలోని నెహ్రూ యువకేంద్రంలో సోమవారం నిర్వహించారు. జిల్లాలోని 13 ప్రభుత్వ పాఠశాల లో చదువుతున్న 9, 10వ తరగతి విద్యార్థులకు హెచ్‌ఐవీ, ఏఐడీఎస్‌, టీబీలపై అవగాహన కల్పించేందుకు క్విజ్‌ పోటీలు నిర్వహించారు. కోటగల్లికి చెందిన చంద్రిజ, శర్వాణీ మొదటి బహుమతి (రూ.వెయ్యి), కుమార్‌గల్లీకి చెందిన స్వామి, కావేరి ద్వితీయ బహుమతి(రూ.750), కుమార్‌గల్లీకి చెందిన స్వాతి, కావేరి(రూ.750) తృతీయ స్థానంలో విజయ్‌సాయికి చెందిన బూన్ర, జవేరియా (రూ.500) నిలిచారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యారోగ్య అధికారిణి దేవి నాగేశ్వరి, జిల్లా యూత్‌ కో ఆర్డినేటర్‌ శైలి బెల్లాల్‌, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ ఘనపూర్‌ వెంకటేశ్వర్లు, డీపీఎం సుధాకర్‌, జిల్లా సైన్స్‌ అధికారి కస్తూరి గంగాకిషన్‌, జిల్లా టీబీ కో ఆర్డినేటర్‌ రవిగౌడ్‌, నవీన్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

అకౌంట్స్‌ గెజిటెడ్‌ సర్వీసెస్‌ అసోసియేషన్‌ కార్యవర్గం

నిజామాబాద్‌అర్బన్‌: తెలంగాణ ట్రెజరీస్‌, అకౌంట్స్‌ గెజిటెడ్‌ సర్వీసెస్‌ అసోసియేషన్‌ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని అధ్యక్షుడు రాములు ఆధ్వర్యంలో నూతన కలెక్టరేట్‌లోని ట్రెజరీ హాలులో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలంగాణ ట్రెజరీ అకౌంట్స్‌ సర్వీసెస్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు గందల పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి పరశురాం, ఇతర కార్యవర్గ సభ్యులు సాయిరెడ్డి, శ్రీనివాస్‌, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌, టీటీఎస్‌ జీవోఏ అధ్యక్ష, కార్యదర్శులు మారుతి, కార్తీక్‌, ఆదిలాబాద్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్ట శ్రీవాస్‌ పాల్గొన్నారు. ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా ట్రెజరరీ సభ్యులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి ప్రాధాన్యత ఇవ్వండి

- అధికారులకు కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశం
- 97 ఫిర్యాదులు నమోదు



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 97 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్‌ అంకిత్‌, ట్రెయినీ కలెక్టర్‌ సంకేత్‌, డీఆర్డీవో సాయాగౌడ్‌, నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్రకుమార్‌, అదనపు ఎస్పీ బస్వారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు అందజేశారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య స్కూల్‌ గుర్తింపును రద్దు చేయండి

నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న శ్రీచైతన్య పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఏబీవీపీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విద్యాశాఖ నిబంధనలను పట్టించుకోకుండా శ్రీచైతన్య పాఠశాలను శ్రీనగర్‌ కాలనీలో నడుపుతున్నారని ఏబీవీపీ ఇందూరు విభాగం కన్వీనర్‌ శశిధర్‌ అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు.

ప్రత్యేక బడ్జెట్‌ కేటాయించాలి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నందిపేటకు చెందిన పలువురు దివ్యాంగులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించారు. తమకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను పెంచాలన్నారు.

విద్యుత్‌ సౌకర్యం కల్పించండి

ఎడపల్లి మండలం జానకంపేట్‌ గ్రామంలో దివ్యాంగులకు ఇళ్లపట్టాలు ఇచ్చి విద్యుత్‌ సౌకర్యం కల్పించలేదని బాలాజీ వికలాంగుల సంఘం నాయకులు కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే విద్యుత్‌ సౌకర్యం కల్పించాలని విన్నవించారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

తమ భూములను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామానికి చెందిన దళితులు కలెక్టర్‌ ఫిర్యాదు చేశారు. తమ దౌర్జన్యానికి పాల్పడుతున్న 12 మందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామానికి చెందిన సుమారు 50 మంది దళితులు కలెక్టరేట్‌కు వచ్చారు.

విద్యాభివృద్ధికి పాటుపడాలి

జిల్లాలో విద్యాభివృద్ధికి పాటుపడాలని టీజీవీపీ నాయకులు కలెక్టర్‌కు విన్నవించారు. తక్షణమే పాలిటెక్నిక్‌ కళాశాలని ఇంజినీరింగ్‌ కళాశాలగా ఏర్పాటు చేసి అడ్మిషన్ల ప్రక్రియను తీసుకురావాలని కోరారు. జిల్లాలో మహిళ డిగ్రీ, వెటర్నరీ, వ్యవసాయ, ఫార్మ సీ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు.

ఇంటిస్థలం కోసం ఉద్యమకారుడి వినతి

మోపాల్‌: ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమించిన తనపై అనేక కేసులు నమోదు చేశారని, కాంగ్రెస్‌ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తనను ఉద్యమకారుడిగా గుర్తించి 250 గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని బోడ మహేందర్‌ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వాలు ఉద్యమకారులను విస్మరించాయని ఆవేదన వ్యక్తంచేశారు.

జూనియర్‌ సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో సత్తా



ప్రథమ స్థానంలో నిలిచిన బాలికల జట్టు



ద్వితీయస్థానంలో నిలిచిన బాలుర జట్టు

- ప్రథమ స్థానంలో బాలికలు.. ద్వితీయ స్థానంలో బాలుర జట్టు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి జూనియర్‌ సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో బాలబాలికల జట్లు ఉత్తమ ప్రతిభకనబర్చి సత్తా చాటాయి. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ జూనియర్‌ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన రాష్ట్ర జూనియర్‌ సాఫ్ట్‌ బాల్‌ పోటీల్లో జిల్లా బాలికల జట్టు ఫైనల్‌లో 10–0 పరుగుల తేడాతో విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. బాలుర జట్టు ఫైనల్స్‌లో మెదక్‌ జట్టుపై పోరాడి 5–3 పరుగుల తేడాతో ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. రాష్ట్ర సాఫ్ట్‌ బాల్‌ అసోసియేషన్‌ ప్రధానకార్యదర్శి కె నవీన్‌కుమార్‌ చేతుల మీదుగా ట్రోఫీలు అందుకున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు వి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్‌ తెలిపారు. బాలబాలికల జట్లను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేశ్‌గౌడ్‌, బేస్‌ బాల్‌ సంఘం అధ్యక్షుడు ఎల్‌ మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్‌, సీనియర్‌ ఫిజికల్‌ డైరెక్టర్లు నీరజారెడ్డి, కె సంగీతారావు, పవన్‌ కుమార్‌, రాజ్‌కుమార్‌, సురేశ్‌, నాగభూషణం, మధుసూదన్‌, ఎస్‌ గంగాధర్‌, రాజేందర్‌, భూపతి, సునీత, ప్రేమ, సుజాత, జోత్స్న, లత, స్వప్న అభినందించారు. జిల్లా జట్లకు కోచ్‌, మేనేజర్లుగా నరేశ్‌, ఎం సుజాత, రాజ్‌కుమార్‌, సెంథిల్‌, బులాబాయి వ్యవహరించారు.

'ఉచిత సేవలే మా ఉద్దేశం'

- గ్లోబల్‌ ఫౌండేషన్‌ ప్రతినిధులు

నిజామాబాద్‌ అర్బన్‌: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత సేవలు అందించడమే తమ ప్రధాన ఉద్దేశం అని గ్లోబల్‌ ఫౌండేషన్‌ సీఈవో బాబర్‌, జిల్లా కో ఆర్డినేటర్‌ త్రివేన్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కొన్నేళ్లుగా ఉచిత సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో కూడా పలు ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్‌ విద్య బోధన, అటెండర్లు, ఆటల పోటీల సహాయకులు, అవసరమైన చోట కంప్యూటర్ల అందజేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే పాఠశాలల్లో తమ ఆధ్వర్యంలో అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి నియమిస్తున్నట్లు తెలిపారు. కానీ కొందరు తమ పేరిట నకిలీ నియామక పత్రాలు సృష్టించి డబ్బులకు విక్రయించి అక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. వీరి పై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. రాజు అనే వ్యక్తి తమ సంస్థకు సంబంధం లేదన్నారు.

ఇరుకు రోడ్లలో ఇంద్రభవనాలు

- నగరంలో ఇష్టారాజ్యంగా షాపింగ్‌ కాంప్లెక్స్‌ల నిర్మాణం
- పార్కింగ్‌, కనీస సౌకర్యాలు కరువు
- సెల్లార్‌లలోనూ బిజినెస్‌
- పట్టించుకోని బల్దియా అధికారులు



ఆర్‌పీరోడ్డులో భారీ షాపింగ్‌ మాల్‌ నిర్మాణం

నిజామాబాద్‌ సిటీ : డబ్బు రుచికి మరిగిన బడా బిజినెస్‌మెన్‌లు నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇరుకు రోడ్లలోనూ ఇంద్రభవనాలను నిర్మిస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. వ్యాపారాల కోసం పాత భవనాలను తొలగించి రోజుల వ్యవధిలోనే పోటాపోటీగా కొత్త భవనాలు నిర్మిస్తున్నారు. భారీ భవన నిర్మాణాల అనుమతుల విషయంలో నిర్మాణదారులను పక్కనపెడితే.. బల్దియా అధికారులే కనీస జాగ్రత్తలు పాటించడం లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అధికారులు ముందూవెనుకా ఆలోచించకుండా అనుమతులు జారీ చేస్తుండగా, వ్యాపారులు ఇష్టారాజ్యంగా భవనాలను నిర్మిస్తున్నారు. ఏ భవనానికి ఏ అధికారి అనుమతులు ఇచ్చారో తెలియని అయోమయ పరిస్థితి టౌన్‌ ప్లానింగ్‌ విభాగంలో ఉంది. టౌన్‌ప్లానింగ్‌ అధికారులకే సరైన 'ప్లానింగ్‌' లేకుండాపోయిందనే విమర్శలున్నాయి. అధికారుల చేతులు తడిపితే తమకు ఇష్టమైన రీతిలో భవనాలను నిర్మించుకోవచ్చనే భావనలో బిల్డర్లు, వ్యాపారవేత్తలున్నారు.

గల్లీల్లో భారీ భవనాలు

నిజామాబాద్‌ నగరంలోని ఖలీల్‌వాడీ, హైదరాబాద్‌ రోడ్డు, దేవీరోడ్డు, ఆర్‌పీ రోడ్డు, బోధన్‌రోడ్డు, వీక్లీ మార్కెట్‌ తదితర ప్రాంతాలు వ్యాపార కేంద్రాలుగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రధానంగా వస్త్ర, ఆభరణాల మాల్స్‌ తోపాటు పెద్దపెద్ద వ్యాపార సముదాయాలున్నాయి. చిన్నచిన్న గల్లీల్లో సైతం పెద్దపెద్ద భవనాలను నిర్మిస్తున్నారు. ఇదే కోవలో చిన్నచిన్న దుకాణాలున్న కుమార్‌గల్లీలో 'ఫ్యాషన్‌ మాల్‌' పేరుతో నాలుగంతస్తుల వస్త్ర వ్యాపార సముదాయాన్ని నిర్మిస్తున్నారు. ఈ భవన నిర్మాణంలో సెట్‌ బ్యాక్‌సైతం వదలలేదు. ఫైర్‌సేఫ్టీ అనుమతులు అనుమానమే. ఒకవేళ ప్రమాదం జరిగితే భవనంలోని కస్టమర్లు సురక్షితంగా బయటకు వెళ్లే మార్గం కూడా ఏర్పాటు చేయలేదు. పార్కింగ్‌స్థలం కూడా తూతూ మంత్రంగా నిర్మించారు. జనరేటర్‌ ఏర్పాటుకు సరైన స్థలం ఇన్ని లోపాలున్నా అనుమతులు పొంది దర్జాగా భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ భవనం ప్రారంభానికి సిద్ధం కావడం విశేషం. ఇంత చిన్న గల్లీలో సరైన భారీ భవన నిర్మాణానికి మున్సిపల్‌ అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. తమ ఇళ్లపై మరో అంతస్తు నిర్మించాలనుకుంటేనే సవాలక్ష కొర్రీలు పెట్టే అధికారులకు ఇంత పెద్ద భవనం కనిపించడం లేదా? అని విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఓపెనింగ్‌ పేరుతో హంగామా

జిల్లాకేంద్రంలో కొత్తగా వెలుస్తున్న పలు వ్యాపార సముదాయాలు, షాపింగ్‌ మాల్స్‌ను ప్రారంభ సమయంలో యజమానులు నానా హంగామా సృష్టించడం ఫ్యాషన్‌గా మారింది. ప్రారంభోత్సవాలకు గ్లామర్‌ను జోడించేందుకు సినీ రంగ ప్రముఖులను రప్పిస్తున్నారు. ఈ సమయంలో నానా హంగామా, హైరానా సృష్టిస్తూ సామాన్య జనాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కొన్నిసార్లు మెయిన్‌రోడ్లను సైతం బ్లాక్‌ చేసి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు.

ఎలా అనుమతిచ్చారు

చిన్న దుకాణానికి మరమ్మతులు చేపడితే ఎన్నో ప్రశ్నలు వేస్తారు. నెలల తరబడి ఆఫీసు చుట్టూ తిప్పుకుంటారు. జనంతో కిక్కిరిసే కుమార్‌గల్లీలో పెద్ద షాపింగ్‌మాల్‌ నిర్మాణానికి ఎలా అనుమతులు ఇస్తారు.అధికారులు ఆలోచించాలి.

– శ్రీనివాస్‌గుప్తా, చిరువ్యాపారి, కుమార్‌గల్లి

నోటీసులిస్తాం

రాష్ట్రపతి రోడ్డు సమీపంలో నూతనంగా వెలుస్తున్న 'వస్త్ర ఫ్యాషన్‌ మాల్‌ 'కు గతంలోనే అనుమతులు తీసుకున్నారు. అయితే భవనానికి సరిపడా సెట్‌ బ్యాక్‌గానీ, సరియైన పార్కింగ్‌ స్థలం లేకున్నా నోటీసులు పంపిస్తాం. పార్కింగ్‌కు ఇబ్బందులు వస్తాయని, పాదాచారులకు, ద్విచక్రదారులకు ఇబ్బందులుకలుగుతాయిని స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. పరిశీలించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి నిబంధనలు అతిక్రమిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, టీపీవో

క్షుద్రపూజల పేరుతో మోసగించేందుకు యత్నం



కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

- నిందితుల అరెస్ట్‌, రిమాండ్‌
- గతంలో పలువురు మహిళలను నిందితులు మోసం చేసినట్లు నిర్ధారణ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): క్షుద్రపూజలు చేస్తే డబ్బులు వస్తాయని మహిళలను నమ్మించి మోసం చేసిన కేసులో ఆరుగురిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. తాడ్వాయి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు.

తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన పైడాకుల తిరుపతితోపాటు అతడి భార్య స్వప్న గ్రామానికి చెందిన ఓ మహిళకు క్షుద్ర పూజలు చేస్తే కోటి రూపాయలు వస్తాయని మాయమాటలు చెప్పారు. దీంతో ఆమె ఈనెల 17న తాడ్వాయి పోలీసు స్టేషన్‌లో వారిపై ఫిర్యాదు చేయగా, పోలీసులు విచారణ చేపట్టారు. తిరుపతితోపాటు అతడి భార్య, బూర్గుల్‌కు చెందిన శ్రీరాం సాయిలు, హైదరాబాద్‌కు చెందిన జమాల్‌పూర్‌ సాయి కుమార్‌, బోధన్‌కు చెందిన గూడ్‌ అలియాస్‌ సలీం, బోధన్‌లోని జైతాపూర్‌కు చెందిన సత్యనారాయణ అలియాస్‌ సతీశ్‌, బోర్గాంకు చెందిన బానోత్‌ మోతీలాల్‌ పూజలు చేస్తామని చెప్పి చాలా మంది మహిళల నుంచి డబ్బులను వసూలు చేయడమే కాకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తేల్చారు. ఈ కేసులో షేక్‌ గూడ్‌, సత్యనారాయణ, బానోత్‌ మోతీలాల్‌, జమాల్‌పూర్‌ సాయికుమార్‌, సాయిలు, పైడాకుల తిరుపతిని సోమవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. మూఢనమ్మకాలకు బలికావొద్దని, పూజలపేరుతో ఎవరైనా నమ్మించే ప్రయత్నం చేస్తే పోలీస్‌ స్టేషన్‌లో లేదా డయల్‌ 100కు ఫిర్యాదు చేయాలని డీఎస్పీ సూచించారు. ఫిర్యాదుదారుల పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో సీఐ సంతోష్‌కుమార్‌, ఎస్సైలు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- టీవీఎస్‌ ఎక్సెల్‌ వాహనాలను ఢీకొట్టిన స్కార్పియో, లారీ
- సాలూరలో తండ్రి మృతి.. కుమారుడికి స్వల్ప గాయాలు
- ఇందల్వాయిలో భార్య మృతి.. భర్తకు గాయాలు

జిల్లాలోని సాలూర, ఇందల్వాయి మండలాల్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాలు రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. ఆయా చోట్ల టీవీఎస్‌ ఎక్సెల్‌ వాహనాలను స్కార్పియో, లారీ ఢీకొట్టాయి. సాలూరలో తండ్రి మృతి చెందగా, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఇందల్వాయిలో భార్య దుర్మరణం పాలవగా, భర్తకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆయా ఘటనలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

సాలూరలో..



సంజీవ్‌(ఫైల్‌)

బోధన్‌రూరల్‌: సాలూర మండలం హున్సా గ్రామానికి చెందిన కట్టేకాల సంజీవ్‌ (45) తన పెద్ద కొడుకు అనిల్‌తో కలిసి టీవీఎస్‌పై పని నిమిత్తం బోధన్‌కు వైపు వస్తూ సాలూర – హున్సా బైపాస్‌ రోడ్డును క్రాస్‌ చేస్తుండగా మహారాష్ట్ర నుంచి వస్తున్న స్కార్పియో (ఎంహెచ్‌ 22యూ 7313) ఢీకొట్టింది. ఈ ఘటనలో సంజీవ్‌ (45)కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని బోధన్‌ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సంజీవ్‌ కొడుకు అనిల్‌ స్కార్పియో వేగంగా వస్తున్నది గమనించి పక్కకు దూకేయడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.

జాతీయ రహదారిపై..

ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన భార్యభర్తలు కుర్మ బుచ్చి మల్లయ్య తన భార్య గంగవ్వ ఆరోగ్యం బాగాలేకపోవడంతో టీవీఎస్‌ ఎక్సెల్‌పై జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సోమవారం ఉదయం బయల్దేరాడు. జాతీయ రహదారి 44వ నంబర్‌ జాతీయ రహదారిపై యూటర్న్‌ తీసుకుంటుండగా కామారెడ్డి వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో గంగవ్వ అక్కడికక్కడ మృతి చెందగా, మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. లారీని టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోజ్‌కుమార్‌ తెలిపారు.



గంగవ్వ మృతదేహం

చోరీకి యత్నించిన యువకుడు

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఓ యువకుడు పట్టపగలు చోరీకి యత్నించాడు. డెయిరీ ఫారం ప్రాంతానికి చెందిన నసీర్‌.. సీఎం రోడ్‌ గల్లీలోని మదర్సా మజారుల్‌ పాలం ప్రాంతంలోని వాజీద్‌ ఖాన్‌ ఇంటి తాళలను పగులగొట్టి చోరీకి యత్నించాడు. బీరువాను ధ్వంసం చేస్తున్న సమయంలో ఇంటి యజమాని రావడంతో అతడిని నసీర్‌ కత్తితో బెదిరించి పారిపోయేందుకు యత్నించాడు. అప్రమత్తమైన ఇంటి యజమాని కేకలు వేయడంతో స్థానికులు నసీర్‌ను పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

విద్యుత్‌ వైర్లు చోరీ



వర్ని: మండలంలోని సత్యనారాయణపురం గ్రామపంచాయతీలో విద్యుత్‌ వైర్లు చోరీ అయినట్లు పంచాయతీ కార్యదర్శి సాయిలు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున దుండగులు గ్రామపంచాయతీ తాగునీటి కోసం వినియోగించే పంపుసెట్ల వద్ద విద్యుత్‌ వైర్లను ఎత్తుకెళ్లారన్నారు. గత రెండు రోజుల క్రితం విద్యుత్‌ వైర్లకు చోరీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను పట్టుకొని పోలీసులకు అప్పగించామని, మళ్లీ ఇదే ఘటన పునరావృతమైందన్నారు.

బైక్‌ను ఎత్తుకెళ్లిన దుండగులు..

మండల కేంద్రానికి చెందిన ప్రకాశ్‌ అనే వ్యక్తి తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉంచగా, దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడు స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని సాయినగర్‌లో పేకాటస్థావరంపై ఆదివారం అర్ధరాత్రి దాడి చేసినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. పక్కా సమాచారం మేరకు పేకటస్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, పట్టుబడిన వారి నుంచి రూ.11,390 నగదుతోపాటు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

స్వాతంత్య్ర సమయోధుడు మృతి



శ్యాంసుందర్‌రెడ్డి(ఫైల్‌)

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని రాంనగర్‌లో నివాసం ఉంటున్న స్వాతంత్య్ర సమరయోధుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు శ్యాం సుందర్‌రెడ్డి సోమవారం తెల్లవారు జమున మృతి చెందారు. 1946కి ముందు రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి జైలుశిక్ష అనుభవించిన శ్యాం సుందర్‌రెడ్డి.. స్వాతంత్య్రం అనంతరం జైలు నుంచి విడుదలయ్యారు. ఆయన అంత్యక్రియల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు సుంకరి రంగన్న, కౌన్సిలర్‌ గంగామోహన్‌ చక్రు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యుత్‌ షాక్‌తో యువకుడికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో గంగాధర్‌

ఇందల్వాయి: లోలం గ్రామానికి చెందిన రాంపూర్‌ గంగాధర్‌ అనే యువకుడు ఆదివారం రాత్రి పొలం వద్ద విద్యుత్‌ షాక్‌కు గురయ్యాడు. పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ ఫ్యూజ్‌ వైరు పోవడంతో సరి చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌ పైకి ఎక్కగా 11 కేవీ వైర్లు తగిలి ప్రమాదానికి గురయ్యాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి ఉద్యోగి మృతి



శ్రీనివాస్‌ (ఫైల్‌)

కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు నీట మునిగి ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందిన ఘటన కామారెడ్డి పెద్ద చెరువు వద్ద సోమవారం జరిగింది. పట్టణంలోని కల్కినగర్‌ కాలనీలో నివాసం ఉండే నాయకోటి శ్రీనివాస్‌ (45) భిక్కనూర్‌ మండల పరిషత్‌ కార్యాలయంలో టైపిస్టుగా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం స్నానం చేసి వస్తానని చెప్పి పక్కనే ఉండే పెద్ద చెరువుకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి చూడగా, బైక్‌, చెప్పులు, దుస్తులు కనిపించడంతో ఆందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించి చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా, శ్రీనివాస్‌ మృతదేహం లభించింది. మృతుడికి భార్య చంద్రకళ, కుమార్తె సౌమ్యం ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

15 రోజులుగా సెలవులో..

భిక్కనూరు: మండల పరిషత్‌ అభివృద్ధి అధికారి కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న నాయికోటి శ్రీనివాస్‌ గత పదిహేను రోజులుగా సెలవులో ఉన్నాడు. కార్యాలయ సిబ్బంది ఉదయం ఫోన్‌ చేయగా లిఫ్ట్‌ చేయలేదు. శ్రీనివాస్‌ మృతి చెందినట్లు తెలిసి ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. శ్రీనివాస్‌ ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

పరిస్థితి విషమించి వృద్ధురాలి మృతి

నవీపేట: విద్యుత్‌షాక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని అబ్బాపూర్‌(ఎం)కు చెందిన గైని రుక్మాబాయి(64) పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందినట్లు ఎస్సై వినయ్‌ తెలిపారు. ఈ నెల 20న ఇంటి పైకప్పుపై ఉన్న కోతులను వెళ్లగొడుతుండగా ప్రమాదవశాత్తు రుక్మాబాయికి షాక్‌ తగిలింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కొడుకు పద్మారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

టీటీపేట: మండల కేంద్రానికి చెందిన చెన్నయ్యగారి భాస్కర్‌ అలియాస్‌ స్వామి(28) తాగుడికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రభాకర్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తాగుడికి బానిసైన స్వామి డబ్బుల కోసం ఈనెల 21వ తేదీన తల్లిని కొట్టడంతో ఆమె ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న స్వామి సోమవారం దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం



బహదూర్‌ (ఫైల్‌)

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌ కాలనీకి చెందిన మహ్మద్‌ బహదూర్‌ ఖాన్‌ (50) అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. డ్రైవర్‌ గా పని చేసే బహదూర్‌ ఖాన్‌ ఈ నెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఖాన్‌ ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య నూర్జహాన్‌ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.